క్లుప్తంగా

జాగ్రత్తలతో పంటి సమస్యలకు చెక్



వృద్ధురాలికి దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మజ

ఆలూరు రూరల్: ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే పంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఆలూరు సీహెచ్‌సీ వైద్యురాలు పద్మజ అన్నారు. జాతీయ నోటి ఆరోగ్య దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆమె స్థానిక సచివాలయం–4 లో నోటి, పంటి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. చిన్న పిల్లల్లో పంటి సమస్యలు రాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి పూట తీపి పదార్థాలు ఇవ్వరాదన్నారు. ఉదయం, సాయంత్రం బ్రష్ చేయించాలని సూచించారు. బీడీ, సిగరెట్, ఖైనీ వంటి మాదకద్రవ్యాలకు యువకులు, వృద్ధులు దూరంగా ఉండాలని సూచించారు. శుక్రవారం సచివాలయం–4 పరిధిలో 46 మంది వృద్ధులు, 14 మంది చిన్న పిల్లలకు నోటి పరీక్షలు చేసి మందులు అందించినట్లు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండా గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఎల్లార్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ మల్లికార్జున, ఆయన సోదరుడు లక్ష్మీకాంత్ శుక్రవారం రూ.20 వేలు విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

తుగ్గలి/మద్దికెర: మరమ్మతు పనుల కారణంగా శనివారం తుగ్గలి, మద్దికెర మండలాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాలో స్వల్ప మార్పులు ఉండవచ్చని తెలిపారు.

క్రీడాకారులకు షూ పంపిణీ

పత్తికొండ రూరల్: స్థానిక క్రీడావికాస కేంద్రంలో శుక్రవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడాకారులు 40 మందికి షూ పంపిణీ చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులు రమణ, నటరాజ్‌లు క్రీడాకారులకు షూ అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వికాస కేంద్రం కోచ్ ధనుంజయుడు, వాలీబాల్ స్టేట్ రెఫరీ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ



చిప్పగిరి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

చిప్పగిరి: స్థానిక గ్రామ సచివాలయాన్ని తహసీల్దారు లక్ష్మీనారాయణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రతిఒక్కరూ సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా కృషిచేయాలని, సంక్షేమ పథకాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, వీఆర్‌ఓ తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తుగ్గలి: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను శుక్రవారం ప్రబోధ సేవా సమితి తుగ్గలి కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గిరిగెట్ల సచివాలయ సిబ్బందిచే ఆవిష్కరించారు. తెలుగు పండుగల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకాల సారము, సరళమైన భాషలో క్యాలెండర్ రూపొందించినట్లు సమితి సభ్యులు తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయాలి

ఆలూరు: ఉపాధ్యాయులు గురుతర బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని హాలహర్వి జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప సూచించారు. మనబడి నాడు–నేడు మొదటి విడత నిధులతో కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీపీ బసప్ప, మండల కన్వీనర్ భీమప్ప, చింతకుంట వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



భీరప్ప స్వామి

వెల్దుర్తి: మండల పరిధిలోని సూదేపల్లె గ్రామంలో భీరప్ప స్వామి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కట్టె కోలన్నలు, నందికోల సేవ, పంచమాంకములు నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు శరభారెడ్డి, సమీర్ కుమార్ రెడ్డి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి తదితరులు ప్రతిష్ఠలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాగి గంజి.. పోషకాలు సమృద్ధి

ఒకప్పుడు పేదలు మాత్రమే గంజిని ఆహారంగా తీసుకునేవారు.. ప్రస్తుతం బెంజిలో తిరిగే వారు కూడా ఇష్టంగా స్వీకరిస్తున్నారు. కారణం.. రాగుల్లో ఎన్నో పోషక విలువలుండటం, ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయని నిపుణులు పేర్కొంటుండటంతో అన్ని వర్గాల వారు మళ్లీ గంజి వైపు మళ్లుతున్నారు. రాగులను కేవలం గంజి రూపంలోనే కాకుండా రొట్టె, పాయసం, లడ్డు, ముద్ద, దోసె, బర్ఫీలు, ఉప్మా తదితర రకాలుగా భుజిస్తున్నారు.

- రాగుల వాడకంపై ప్రజల్లో పెరిగిన ఆసక్తి
- మెండుగా ఆరోగ్య ప్రయోజనాలు



పత్తికొండలోని ఓ హోటల్‌లో రాగి గంజి తయారు చేస్తున్న నిర్వాహకుడు

పత్తికొండ రూరల్: ఆరోగ్యాన్ని పెంపొందించే వన్నీ ప్రకృతిలో సులభంగా, తక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి రాగులు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రాగుల వినియోగం గురించి చర్చ ఎక్కువగా సాగుతోంది. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగడం, పురాతన ఆహారపు అలవాట్లలో సంప్రదాయ పదార్థమైన గంజిలోని పోషకాల గురించి తెలిసిపోవడంతో సోషల్ మీడియా ద్వారా నిత్యం ఏదో ఒక రూపంలో ప్రజల మధ్య ప్రస్తావనకు వస్తోంది. దీంతో మరోసారి మనదేశ సంప్రదాయ వంటకం ప్రాధాన్యతను సంపాదించుకుంది.

మారిన జీవనశైలి..

మారిన జీవనశైలితో వ్యాధులు కూడా వేగంగా ప్రబలుతున్నాయి. కొన్ని దీర్ఘకాలికంగా ఉండి ఆర్థికంగా, శారీరకంగా దెబ్బతీస్తుండటంతో నివారణ కోసం ప్రజలు వివిధ మార్గాలు అనుసరిస్తున్నారు. ముఖ్యంగా ఆహారంలో చోటు చేసుకున్న మార్పులే వ్యాధులకు కారణమని తెలిసిపోవడంతో మళ్లీ సంప్రదాయ వంటకాల వైపు జనం మళ్లుతున్నారు. ఇందులో భాగంగా రాగులతో చేసిన వంటకాలకు ఆదరణ పెరిగింది.

ధర తక్కువ..

తక్కువ ధరకే దొరకడంతో పాటు తక్కువ సమయంలో తయారు చేసుకునే రాగి గంజి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కోసం రాగి మాల్ట్ తాగేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. టీస్టాళ్లలో టీ, కాఫీలకు బదులుగా రాగి గంజి వచ్చి చేరింది. రోజువారీ ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు. మధుమేహం, బీపీ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. స్థూలకాయాన్ని నివారిస్తుంది. రాగి జావ రోజూ తాగినా, రాగిముద్ద తిన్నా ఆరోగ్యకరమైన ప్రయోజనాలు చేకూరుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఫైబర్, ప్రొటీన్లు, న్యూట్రీషియన్లు సమృద్ధిగా ఉంటాయి. రాగుల్లోని పోషకాలు, ఫైబర్ వల్ల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తుండటంతో వీటి వాడకానికి ప్రజలు మక్కువ చూపుతున్నారు.

పోషకాల గని..

రాగి గంజిలో విటమిన్లు, మినరల్స్, కార్బోహైడ్రేడ్లు, ఫైబర్ తదితర పోషకాలు దాగి ఉంది. బి కాంప్లెక్స్ విటమిన్, థయామిన్, రిబోఫ్లావిన్, నియాసిన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పాస్పరస్ అధికంగా ఉంటాయి.

ఆరోగ్య ప్రయోజనాలు..

- రాగి జావ రోజూ తీసుకుంటే ఆందోళన, డిప్రెషన్, నిద్రలేమి, సమస్యలు తగ్గించుకోవచ్చు.
- యాంటి యాక్సిడెంట్‌లు ట్రిప్టోఫాన్, అమైనో ఆమ్లాలు సహజ సడలింపుగా పనిచేసి విశ్రాంతిని కలిగిస్తాయి.
- రాగి జావలో పాలీఫెనాల్స్, డైటరీ ఫైబర్, మెగ్నీషియం ఎక్కువగా ఉండటం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.
- మధుమేహాన్ని నియంత్రించేందుకు దోహదం చేస్తుంది.
- కొలెస్ట్రాల్, సోడియం ఉండదు కావున గుండెజబ్బులు ఉన్న వారు కూడా రాగి పిండితో చేసిన వంటకాలు తినడం, రాగి జావ తాగడం శ్రేయస్కరమే. గుండె పనితీరును మెరుగుపరుస్తుంది.
- రక్తహీనత ఉన్న వారు రాగి గంజిని తీసుకోవడం వల్ల విటమిన్ సి స్థాయిని పెంచుతుంది. రక్తప్రవాహంలో ఇనుము శోషణను సులభతరం చేస్తుంది. ఇది రక్తంలోని హిమోగ్లోబిన్ స్థాయిని కూడా పెంచుతుంది.
- రాగిలో ఉన్న కాల్షియం ఎముకల బలాన్ని పెంచడంలో సహాయపడుతుంది. రాగి పిండిలో ఉన్న భాస్వరం ఎముకలు, దంత సంరక్షణకు ఉపయోగపడుతుంది.
- చర్మ సంరక్షణకు, జుట్టు పెరిగేందుకు రాగిలో ఉన్న విటమిన్ 'ఇ' దోహద పడుతుంది. ఇది శరీరంపై ఉన్న గాయాలను మానేలా చేసేందుకు సహజమైన మందుగా పనిచేస్తుంది. రక్తప్రసరణ మెరుగుపరచి జుట్టు పెరిగేందుకు దోహదపడుతుంది.

రోజూ మూడుసార్లు రాగి గంజి తాగుతా



టీ, కాఫీలకు బదులుగా ప్రతిరోజూ మూడు సార్లు రాగి గంజిని తాగుతున్నా. ఎండాకాలం ప్రారంభం కావడంతో టీ స్టాల్స్, హోటల్స్‌లో కూడా రాగి గంజి లభిస్తుంది. రాగులతో చేసిన ఆహార పదార్థాలను డైట్‌లో తీసుకుంటుంటాను. ఎలాంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నా.

– పవన్, పత్తికొండ

రాగి మాల్ట్‌తో ఎన్నో ప్రయోజనాలు



రాగుల్లో ఫైబర్, ప్రొటీన్లు, న్యూట్రిషన్లు సమృద్ధిగా ఉంటాయి. వీటిలోని పోషకాలు, ఫైబర్ వల్ల అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. టీ, కాఫీలకు బదులు రాగి గంజి తీసుకోవడం మంచిది. రాగులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బీపీ, షుగర్ సమస్యల నుంచి బయటపడవచ్చు. అలాగే జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. ఎండాకాలంలో రాగిజావ, రాగిముద్ద తినడం శ్రేయస్కరం.

– శ్రావణి, ప్రభుత్వ వైద్యురాలు, పుచ్చకాయలమాడ పీహెచ్‌సీ

క్రైం కార్నర్

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లిన కారు

హొళగుంద: కోగిలతోట రోడ్డులోని ముద్దటమాగి క్రాస్ వద్ద శుక్రవారం ఆదోనికి చెందిన కారు (టీఎస్ 08 హెచ్‌వై 4477) అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న నలుగురు ప్రయాణికులు క్షేమంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు. సదరు వ్యక్తులు కోగిలతోట గ్రామంలో జరుగుతున్న మారెమ్మ, సుంకులమ్మ దేవరకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదరుగా వచ్చిన వాహనాలకు దారి ఇచ్చే క్రమంగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. స్థానికులు పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ మల్లికార్జున

చిప్పగిరి: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చిప్పగిరి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. హాలహర్వి మండలం మల్లికార్జునపల్లికి చెందిన బోయ సురేంద్ర, చిప్పగిరి మండలం తిమ్మాపురానికి చెందిన బోయ సురేష్ శుక్రవారం అక్రమంగా మద్యం తరలిస్తుండగా మండలంలోని నేమకల్లు, తిమ్మాపురం క్రాస్ వద్ద పట్టుకొని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 480 హైవార్డ్ విస్కీ (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని రెండు బైకులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగుల వార్డులు, రికార్డులను పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు తగిన వైద్య సేవలు అందుతున్నాయా? లేదా? వైద్యుల పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఏమైన సమస్యలున్నా, మరమ్మతులు చేయించాలన్నా, హస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి నిధులను ఖర్చు చేసుకోవాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న వంద పడకల హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. వేసవి ఆరంభం అయ్యిందని, వడదెబ్బ, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రోగులకు కావలసిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్లు, వీఆర్వో షేక్షావలి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై సత్వరం స్పందించండి

ఎమ్మిగనూరుటౌన్: సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలపై సత్వరం చర్యలు తీసుకొని వాటిని పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 26వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, మూమెంట్ రిజిష్టర్, పలు రికార్డులను పరిశీలించి ప్రజలకందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

ఇటుక బట్టీల కాలుష్యాన్ని నివారించండి

పట్టణం, మండల పరిధిలో ఇటుకల బట్టీల ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు.ఈ మేరకు పట్టణానికి వచ్చిన సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

లక్ష్యానికి మించి పనులు



హెచ్. కైరవాడిలో కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమరనాథ రెడ్డి

గోనెగండ్ల: ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యానికి మించి పనులు కల్పించాలని డ్వామా పీడీ అమరనాథ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో జరుగుతున్న కాలువలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వలస వెళ్లకుండా ఉండేందుకు గాను గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధి పనుల్లో రోజుకు కనీస వేతనం రూ.253 పడేటట్లు పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. బ్యాంక్ అకౌంట్, జాబ్‌కార్డుకు ఆధార్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని కూలీలకు సూచించారు. చేసిన పనులకు వేతనాలు వెంటనే మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే పండ్ల తోటలు, మునగ మొక్కలు వేసుకునేందుకు ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే జిల్లాలో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచి వలసల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో సిబ్బంది ఎవరు నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

ఆలూరు: వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వీడాలని డ్వామా పీడీ అమరనాథ్ రెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం కోర్సు డైరెక్టర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదోని, ఆలూరు, పత్తికొండ క్లస్టర్ల పరిధిలోని ఉపాధి పథకం ఏపీడీ, డీఆర్‌పీ, టీఏ, ఈసీ, డీటీపీలతో ఆయన సమావేశమయ్యారు. పీడీ మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించి ఎస్టిమేషన్లు పంపాలని, అలాగే కూలీల ఆధార్ కార్డుతో మస్టర్లలో అనుసంధానం చేయాలని సూచించారు. కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు.

గాయపడిన యువకుడి మృతి



రామకృష్ణ (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి – దేవనబండ గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ (19) శుక్రవారం మృతి చెందాడు. పెద్దకడబూరు మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన తిక్కన్న, సరస్వతి దంపతుల కుమారుడైన రామక్రిష్ణ చిన్నప్పటి నుంచి అటికెలగుండులో బంధువుల వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి బైక్‌పై వెళ్తు ప్రమాదానికి గురికాగా పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా అర్ధరాత్రి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

24న మార్కెట్ వేలాలు

ఆలూరు రూరల్: ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మార్కెట్ వేలాలు ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఈఓ కృష్ణ కుమార్ శుక్రవారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ పరిధిలోని వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, గొర్రెల మాంసం మార్కెట్, వధశాల, పశువుల మాంసం మార్కెట్, వధశాల యందు రుసుము వసూలు చేసేందుకు బహిరంగ వేలాలు వేస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు సాల్వెన్స్ సర్టిఫికెట్ సమర్పించి వేలాల్లో పాల్గొనవచ్చని సూచించారు. వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు వేలాలకు రూ.లక్ష డిపాజిట్‌తో పాటు, రూ.రెండు లక్షల సాల్వెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వేలంలో నిర్వహణ హక్కులు దక్కించుకున్న వారు డిపాజిట్ నగదు పోనూ మిగతా నగదు ఏకకాలంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మొత్తం నగదుపై మూడు శాతం నగదు స్టాంపు డ్యూటీ రూపంలో చెల్లించాలన్నారు.

జర్నలిస్టులు సమాజ హితానికి పనిచేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్

ఎమ్మిగనూరు టౌన్: సమాజ హితం కోసం ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా జర్నలిస్టులు పనిచేయాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ సూచించారు. శుక్రవారం పట్టణంలో ఏపీయుడబ్ల్యూజే తాలుకా మహాసభలు జరిగాయి. ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి మహాత్మా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ పతాకాన్ని సీనియర్ జర్నలిస్టులు సుబ్బారావు, బజారప్పలు ఆవిష్కరించారు. అనంతరం కుర్ణిక క్యాణ మండపంలో సంఘ నాయకులు హేమంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను తన వంతుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. అనంతరం తాలుకా, పట్టణ నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

నందవరం: ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో ఆర్ఢీఫ్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. రిలయన్స్ ప్రతినిధి కరుణప్ప, ఆర్ఢీఫ్ కార్యకర్త ఉసేని, పంచాయతీ కార్యదర్శి రామారావు ఉన్నారు.

ఘనంగా మేటి కుంభోత్సవం



కోగిలతోటలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలను సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామంలో వెలసిన సుంకలమ్మ, మారెమ్మ దేవి మేటి కుంభోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు నారాయణస్వామి తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వారిని గ్రామ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి గంగి పూజ, అమ్మ వార్ల ముఖాల దర్శన కార్యక్రమం జరిగింది. శుక్రవారం తెల్లవారు జామున 3.35 గంటలకు మేటి కుంభోత్సవాల ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, సర్పంచ్ యాట గురుపాదమ్మ తెలిపారు.

మెనూ తప్పనిసరి

గోనెగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం గోనెగండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (లక్ష్మీపేట)ను వారు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో నూతన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం నూతనంగా రాగి జావను అమలు చేసిందని, అన్ని పాఠశాలల్లో ఈనెల 21 నుంచి విద్యార్థులకు రాగి జావా అందించాలని సూచించారు.

టి.చాకిబండలో ప్రత్యేక పూజలు

ఆలూరు: హాలహర్వి మండలం టి.చాకిబండ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంపై ప్రధాన కలశ ప్రతిష్ఠాపన సందర్భంగా శుక్రవారం పండితులు రామనాథ్‌శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, మన్యు సూక్త హోమంను నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, హాలహర్వి ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల కన్వీనర్ బోయ నెట్టకంతమ్మ, లింగప్ప, భీమప్ప, సర్పంచ్ ఓబులపతి, ధర్మకర్త కె.సిద్దప్ప, బేవినహాళ్ సర్పంచ్ బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం శిఖర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

నందవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం ముగతి గ్రామంలో ఫ్రైడే– డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవలు విస్తృతం చేయాలి

కృష్ణగిరి: సచివాలయంలో ప్రజలకు అందించే సర్వీసులను పెంచాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో రోజుకు 15 సర్వీసులు జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ యాప్‌ను అందరు డౌన్‌లోడ్ చేసుకుని ప్రభుత్వ సేవలను అందులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

హొళగుంద: మడ్డిలింగదహళ్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ సుధాకర్ సహకారంతో ఆదోనికి చెందిన మధు హాస్పిటల్ వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. గుండె చికిత్స నిపుణులు డాక్టర్ సుభాష్, ప్రసూతి, గర్భకోశ స్త్రీ వ్యాధి నిపుణులు లక్ష్మీప్రసన్న, కంటి వైద్య నిపుణులు మానస తదితరులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

వెల్దుర్తి: రైతులు ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది భూజేశ్వరుడు, శ్రీకాంత్, రాజీవుడు సూచించారు. శుక్రవారం రామళ్లకోట, సర్పరాజాపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పొదుపు మహిళలు, విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. సిబ్బంది పరమేశ్, శివకృష్ణ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

పత్తికొండ రూరల్: మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న బాలేసు (40) శుక్రవారం మృతి చెందాడు. కొన్నాళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న బాలేసు ఇంట్లోనే కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి నలుగురు ఆడపిల్లలు సంతానం కాగా ఇద్దరికి వివాహం అయ్యింది. ఇద్దరు బాలికలు చదువుకుంటున్నారు. భార్య సంతోషమ్మ ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది.ప్రస్తుతం తండ్రి కూడా మరణించడంతో బాలికలు అనాథలయ్యారు.